జెజెఎం పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

పార్వతీపురం : జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎన్ ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలో మంచినీటి సరఫరా, పారిశుధ్య కార్యక్రమాల పురోగతిని సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ వాటర్ శానిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ అధికారులకు కీలక సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా జల్ జీవన్ మిషన్ పనులు, గ్రామాల్లో కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జల్ జీవన్ మిషన్ పనులు చాలా నెమ్మదిగా సాగుతున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే గుర్తించి, వాటిని వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోని సచివాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో మంజూరైన కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణాల పురోగతి కేవలం 30 నుంచి 40 శాతం మాత్రమే ఉందని కలెక్టర్ అన్నారు. ఈ నిర్మాణాలన్నింటినీ మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కార్మిక విముక్తి ఎర్రజెండా : సిఐటియు

జాతీయ మహాసభ జయప్రదం కోరుతూ పలుచోట్ల జెండా ఆవిష్కరణలు

బలిజిపేటలో జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -పార్వతీపురం

కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక, దోపిడీ, అన్యాయం, అసమానతల నుంచి విముక్తి కలిగించేది కార్మిక వర్గ ఎర్రజెండా మాత్రమేనని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ అన్నారు. సిఐటియు 18వ అఖిలభారత మహాసభల జయప్రదం కొరకు దేశవ్యాప్త పిలుపులో భాగంగా జిల్లాలో పలుచోట్ల సోమవారం సిఐటియు జెండాలను నాయకులు ఆవిష్కరించారు. ఇందులో భాగంగా పట్టణంలోని జరిగిన కార్యక్రమంలో వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, వి.ఇందిర మాట్లాడుతూ ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభలు కార్మిక వర్గానికి కన్నుల పండగ వంటిదని పేర్కొన్నారు. ప్రతి మూడేళ్లకొకసారి ఆలిండియా మహాసభలు జరుగుతాయని, అలాగే ఈ మహాసభలు మొట్టమొదటిసారిగా రాష్ట్రంలోని విశాఖపట్నంలో జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడేళ్లకు ఉద్యమాల తీర్మానాలు చర్చించి కార్యాచరణ చేయడానికి నిర్ణయాలు జరుగుతాయని అన్నారు. ముఖ్యంగా లేబర్ కోడ్స్ వచ్చిన తర్వాత కార్మికుల జీవితం దుర్భరంగా ఏర్పడుతుందని, వీటిని రద్దు చేసే వరకు పోరాడుతామని తెలిపారు. జనవరి 4న విశాఖ బీచ్ వద్ద జరగబోవు ర్యాలీలో యువకులు, కార్మికులు, నగర ప్రజలు పెద్ద మొత్తంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. తొలుత స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిహెచ్ సింహాచలం అధ్యక్షతన పి.ఇప్పలమ్మ, బెలగాం మస్తర్ పాయింట్ వద్ద జొన్నాడ గౌరీ, ఆర్టీసీ కాంప్లెక్స్ కేంద్రం వద్ద అప్పలనాయుడు, ఆటో కార్మికుల కేంద్రం వద్ద సింహాచలం, అంగన్వాడీ కేంద్రం వద్ద గౌరీమణి, ప్రభుత్వాసుపత్రి కేంద్రం వద్ద ఆశా యూనియన్ నాయకులు ఎం.శివాని, రైస్ మిల్ కేంద్రం వద్ద పి.లక్ష్మణరావు, తాళ్లబురిడీలో ఆశా, అంగన్వాడీ, సిహెచ్.డబ్ల్యు, ఐద్వా మహిళలు, గిరిజనులు జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ప్రతి ఇంటిపై జెండా ఎగరవేయాలనే సిఐటియు పిలుపులో భాగంగా కార్మికులు వారి వారి ఇళ్లపై జెండాలు కట్టి ఎర్రజెండాపై ఉన్న అభిమానాన్ని, గౌరవాన్ని చాటిచెప్పారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బి.లక్ష్మి, పి.రాజశేఖర్, జి.తులసి, కృష్ణ, ఎస్.శంకర్రావు, మామిడి శివ, ఎస్.నాగరాజు,త్రివేణి, రామలక్ష్మి, రాములమ్మ, పార్వతమ్మ, శంకరరావు, ఎస్.శివ, ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఇంజనీరింగ్ కార్మికులు వై.హరిబాబు, గారవీధిలో పారిశుద్ధ కార్మికులు ఇంటింటికి జెండాలు ఎగరవేశారు. వెంకంపేట సచివాలయం పరిధిలో ఒకటి రెండు వార్డుల్లో జెండాలు ఎగరవేశారు. ఎన్ కె రాజపురం 3, 5 వార్డు, ఇందిరా నగర్ కాలనీ 6 వార్డులో భవననిర్మాణ కార్మికుల ఇంటిదగ్గర జెండాలు ఎగరవేశారు.

మండలంలోని గొట్ట మంగళాపురం, బుక్కురు, నవగాము, పనుకువలస గుడివాడ ,చింతాడ ,తుమరాడ తదితర గ్రామాలలో సిఐటియు జెండాలను ఆవిష్కరించి అఖిల భారత సిఐటియు మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణా రావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమాల్లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.హిమప్రభ, అంగనవాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి. అమరవేణి, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.గౌరేశ్వరి, సిఐటియు మండల కార్యదర్శి కాదా రాము, వివిధ కార్మిక సంఘాల నాయకులు బి.లలిత, వి.పార్వతమ్మ, రామలక్ష్మి,రాంబాబు, మజ్జి వీరం నాయుడు, గిరి హేమ సుందరు, మల్లవరపు రమేష్, అంగనాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం, మున్సిపల్ కార్మికులు, ఆటో, భవనం, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

సాలూరు : సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు జయప్రదం కావాలని ఆకాంక్షిస్తూ వాడవాడలా సిఐటియు జెండా ఆవిష్కరణ చేసే కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం, ఆటో స్టాండ్లు, గాంధీనగరంలో జెండా ఆవిష్కరణలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు జండా ఎగరవేశారు. మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రవి, శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో యూనియన్ జిల్లా సహాధ్యక్షులు రాముడు, కమిటీ నాయకులు శ్రీను పోలరాజు, పర్మినెంట్ కార్మికుల సంఘం నాయకులు వెంకటరావు, వెంకటరమణ, మహిళా నాయకులు పార్వతి, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

బలిజిపేట : సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ బలిజిపేటలో రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ సీనియర్ కార్మికుడు పిట్ట రామప్పుడు సిఐటియి జెండా ఆవిష్కరించారు. మండలంలోని తుమరాడ, గళావల్లి, నారాయణపురం, ఆరు రైస్ మిల్లుల్లో సిఐటియు జెండాల ఆవిష్కరణలు జరిగాయి. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు, మాట్లాడుతూ జాతీయ మహాసభల సందర్భంగా విశాఖలో జనవరి 4న జరగనున్న భారీ బహిరంగసభను విజయవంత చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు యు లక్ష్మి, గేదెల సత్యనారాయణ, మణికంఠ, దలమ్మ, ప్రమీల, ఇందిరా, వరలక్ష్మి, విజయ్ పాల్గొన్నారు.

వీరఘట్టం : సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వీరఘట్టం, వండవ గ్రామాల్లో పతాకాలను జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.సింహాచలం, సిహెచ్ భాగ్యలక్ష్మి, పి.ప్రసాదరావు, వై.ప్రసాదరావు, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

కొమరాడ : సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం. మాదలంగి అంగన్వాడీ సెంటర్ వద్ద, మరియు కొమరాడలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమాల్లో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కొమరాడ ప్రాజెక్టుకార్యదర్శి సిరికి అనురాధ, మాదలింగి సెక్టార్ లీడర్ పద్మ, ఆటో యూనియన్ నాయకులు గోపి, హరి, మిడ్ డే మీల్స్ నాయకులు సీతమ్మ, భవన నిర్మాణ కార్మికులు అడివయ్యా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, రైతు సంఘం నాయకులు వెంకట్రావు, కెవిపిఎస్ నాయకులు బాల, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని కాశీపేట రైస్ మిల్లు వద్ద, స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట సిఐటియు జెండాను జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, మండల కార్యదర్శి జి వెంకటరమణ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, గ్రీన్ అంబాసిడర్ జిల్లా నాయకులు గౌరీశంకర్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శంకర్రావు తో పాటు పలువురు పాల్గొన్నారు. కాశీపేటలో కళాసీ సంఘం సీనియర్ కార్మికులు చుక్క సత్యం, నాయకులు తేలు సత్యం, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రాము, అంగన్వాడీ, ఎండిఎం, ఆశా కార్యకర్తలు ఎం.అప్పల నరసమ్మ, గొడ్డు సిమ్మమ్మ, చుక్క ఆది, లక్ష్మి, కార్మికులు యజ్జల శ్రీను, గొడ్డు పోలారావు తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : మండలకేంద్రమైన మక్కువ ఆటో స్టాండ్ వద్ద సిఐటియు జెండాను సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జి.కృష్ణారావు ఎగురవేశారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం మండలశాఖ అధ్యక్షులు పవన్‌కల్యాణ్, ఈశ్వరరావు, ప్రసాద్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సాలూరులో జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు ఎన్వై నాయుడు

వీరఘట్టంలో సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ఉపాధ్యక్షులు ఇందిర

సర్పంచుల సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

ప్రతి కుటుంబం 'ముస్తాబు' కావాలి

సర్పంచులే గ్రామాలకు బాస్

సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రకృతి సహజ సిద్ధమైన మన్యం జిల్లాను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి సర్పంచికి ఉందని, ఆ దిశగా తమ గ్రామాలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రవేట్ కళ్యాణ మండపంలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్పంచుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా మార్చాల్సిన బాధ్యత సర్పంచులదేనన్నారు. ప్లాస్టిక్‌ను నిషేదించే దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రతి గ్రామానికి సర్పంచే బాస్ అని, సిబ్బందితో పని చేయించుకుని గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రతి గ్రామానికి అంబులెన్సులు వెళ్లేలా చర్యలు తీసుకున్నామని రాబోయే ఫిబ్రవరి నాటికి డోలీ మోతలు లేకుండా రోడ్లను నిర్మిస్తామని చెప్పారు. ఈనెల 21న పల్స్ పోలియో కార్యక్రమం ఉందని ప్రతి బిడ్డకు వ్యాక్సిన్ వేయించేలా సర్పంచ్‌లు గ్రామాల్లో దండోరా ద్వారా తెలియజేయాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా సర్పంచులు బాధ్యత తీసుకోవాలని, డిగ్రీ వరకూ చదివిన తర్వాతే పెళ్లి చేసుకుంటామనే నియమం పెట్టుకునేలా యువతకు అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీల్లో ఆదాయం పెరగాలంటే పర్యాటక రంగాన్ని ప్రోత్సహించి, అభివృద్ధి పర్చేలా సర్పంచులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మా ఊరికి మలేరియా వచ్చింది అని సందేశం ప్రజల్లో అద్భుతమైన ఫలితాన్నిచ్చిందని చెప్పారు. మురుగు నీరు ఉన్న దగ్గర ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. స్కూల్ పిల్లలతో ఆయిల్ బాల్స్ తయారు చేయించాలని సూచించారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య సమస్యలు వస్తే ఆర్ఎంపిలను ఆశ్రయిం చకుండా ప్రభుత్వం ఆసుపత్రుల ద్వారా వైద్య సేవలు పొందాలన్నారు. బహిరంగ మల మూత్ర విసర్జన నిషేదించాలని సర్పంచ్‌లకు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేసే వ్యక్తులపై ఫైన్ వేసి, అవసరమైతే పోలీసు కేస్ పెట్టె అధికారం సర్పంచ్ లకు ఉందని పేర్కొన్నారు. సర్పంచ్ చెప్పినా వినకపోతే విజిలెన్స్ టీంను ఆయా గ్రామాలకు పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. సర్పంచ్‌లు మహిళా సంఘాలు, యువత సహకారంతో గ్రామాలను అభివృద్ధి పదంలో నడిపించాలని కోరారు. రోడ్డు మీద, వీధుల్లో చెత్త, ప్లాస్టిక్ కనిపించ రాదని, దుకాణాల వద్ద చెత్త చెదారం కనిపిస్తే షాప్ లైసెన్స్ రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఐసిడిఎస్ పిఒ టి.కనక దుర్గ, డిపిఒ కొండలరావు, ఆర్‌బిఎస్ పిఒ డాక్టర్ టి. జగన్ మోహనరావు, పంచాయతీ అధికారులు, జిల్లాలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మహాదేవి వలసలో వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని చలివేంద్రి సచివాలయం పరిధిలో గల మహాదేవివలసలో సోమవారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్, ఎం ఎల్ హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది ,ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పక్కాగా జరగాలి : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

ధాన్యం కొనుగోలు నిర్వహణ సజావుగా జరగాలని, రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ క్లినిక్‌ల నిర్వహణ, పనుల పురోగతి, వివిధ ప్రభుత్వ పథకాల అమలపై పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వేగం పెంచాలని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. అలాగే ప్రతి రెవెన్యూ క్లినిక్‌లోనూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే స్వీకరించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన కాలపరిమితిని నిర్దేశించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. వారసత్వ ధ్రువపత్రాలు, భూమి బదలాయింపులు వంటి నాన్-సెటిల్‌మెంట్ రెవెన్యూ పనులను ఆలస్యం చేయకుండా నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. భూములపై అక్రమ కబ్జాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు సరిహద్దులను పరిశీలించి, వాటిని పరిరక్షించే బాధ్యత తహసీల్దార్లదేనని స్పష్టం చేశారు. కొత్తగా వచ్చిన సామాజిక పింఛన్లు, రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత పాటించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా, పారదర్శకంగా అందాలంటే రెవెన్యూ యంత్రాంగం నిబద్ధతతో పనిచేయాలని హితవు పలికారు.

క్రికెట్‌లో సీతంపేట ఉపాధ్యాయులు విజయం

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండలో జరిగిన డివిజనల్ స్థాయి క్రికెట్ పోటీల్లో సీతంపేట మండల ఉపాధ్యాయులు, కురుపాం మండల ఉపాధ్యాయులపై విజయం సాధించారు. డివిజనల్ స్థాయి చాంపియన్స్‌గా నిలిచారు. వీరిని ఐటిడిఎ పిఒ పవర్ స్వప్న జగన్నాథ్, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్ అభినందించారు. రాష్ట్రస్థాయిలో జరగబోవు పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

పేదలకు ఉచిత వైద్యం దూరం చేయడానికే పిపిపి

కోటి సంతకాల సేకరణ ర్యాలీలో వైసిపి జిల్లా నేతలు

ప్రజాశక్తి - పార్వతీపురం

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉచిత వైద్యాన్ని, వైద్య విద్యను దూరం చేయడానికి టిడిపి కూటమి ప్రభుత్వం పిపిపి పద్ధతిలో ప్రభుత్వ వైద్య కళాశాలలను కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తోందని వైసిపి జిల్లా నేతలు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక వైఎస్సార్ జంక్షన్‌లో గల వైఎస్ విగ్రహానికి మాజీ డిప్యూటీ సిఎంలు రాజన్నదొర, పుష్పశ్రీవాణి, మాజీ ఎమ్మెల్యేలు జోగారావు, కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జిల్లా వైసిపి అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్తురాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా జిల్లా కలెక్టర్ కార్యాలయం పక్కన ఉన్న పెట్రోల్ బంక్ వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీని జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్తు రాజు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాజీ డిప్యూటీ సీఎం లు రాజన్నదొర, పుష్పశ్రీవాణి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య విద్యను, వైద్యాన్ని పేదలకు దూరం చేయాలన్న నిర్ణయాన్ని తక్షణమే కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో అప్పటి సిఎం జగన్ మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను మంజూరు చేయించారని చెప్పారు. అయితే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 7 వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రయివేటీకరణ చేయాలని నిర్ణయించిందని చెప్పారు. దీనికి వ్యతిరేకంగా వైసిపి కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. వైసిపి అధినేత పిలుపు మేరకు నాలుగు నియోజకవర్గాల్లో అన్ని వర్గాల ప్రజలు సంతకాల సేకరణ ఉద్యమంలో భాగస్వాములయ్యారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం రూ.3.5లక్షల కోట్లు అప్పు చేసిందని గగ్గోలు పెట్టిన టిడిపి ఇప్పుడు ఏడాదిన్నర కాలంలోనే రూ.2.5లక్షల కోట్లు అప్పు చేసిందని చెప్పారు. ప్రతిరోజూ అప్పులతోనే రాష్ట్ర ప్రభుత్వం నెట్టుకొస్తోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ రూ.3లక్షల కోట్లు, ఏడాదిన్నర కాలంలో చేసిన అప్పు రూ.2.5లక్షల కోట్లయినప్పుడు పేదల కోసం ఉచిత వైద్యం, వైద్యవిద్య అందించడానికి టిడిపి ప్రభుత్వం రూ.4.5వేల కోట్లు ఖర్చు చేయలేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం హయాంలో రెడ్ బుక్ రాజ్యాంగం ప్రకారం ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల కోసం ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. కోటి సంతకాల సేకరణలో వెల్లువెత్తిన ప్రజావ్యతిరేకతను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వైద్యం, విద్యను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సాలూరు, కురుపాం, పాలకొండ, పార్వతీపురం నియోజకవర్గాల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి లో నిర్వహించిన ర్యాలీ నిర్వహణ కోసం ప్రణాళిక లోపం కారణంగా ఆశించిన స్థాయిలో నాయకులు, కార్యకర్తలు హాజరు కాలేదనే గుసగుసలు వినిపించాయి.

ర్యాలీని ప్రారంభిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్‌రాజు

ఇంధన పొదుపు ప్రతిఒక్కరి బాధ్యత

విద్యుత్ ఆదాపై అందరికీ అవగాహన కలిగించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యతని, విద్యుత్ ఆదా చేసే విధానంపై అందరికీ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ భవనంలో విద్యుత్‌ను ఆదా చేయాలని సూచించారు. విద్యుత్ ఆదా చేయడం విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమేనని, సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగం, పొదుపుపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. ఈనెల 14 నుంచి 20 వరకు జిల్లాలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు పెద్దఎత్తున నిర్వహించాలని, విద్యుత్ పొదుపు చేయడంపై ప్రజలకు అవగాహన సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలని వివరించారు. ఈ సందర్భంగా ఇంధన పొదుపు వారోత్సవాల వాల్ పోస్టర్, కరపత్రాలను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, విద్యుత్ శాఖ ఎస్ఇ కె.చలపతిరావు, ఆపరేషన్, టెక్నికల్ ఇఇ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

20న వన్ సోర్స్ ఆఫ్ రెవెన్యూపై సమావేశం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 20న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వన్ సోర్స్ అఫ్ రెవెన్యూపై మండల స్థాయి సిబ్బందికి ఫిజికల్ ట్రైనింగ్ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఐవి లక్ష్మి తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్స్, వీఆర్వోలు హాజరు కావాలని కోరారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులకు సకాలంలో రేషన్ ఇవ్వాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సేల్స్‌మెన్ వైఖరి మారాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. రేషన్ సరుకులు అందజేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బియ్యం ఇస్తామని సేల్స్‌మెన్ చెప్పగా సోమవారం ఉదయం 8 గంటలకు డిపోకు వస్తే, సాయంత్రం 4గంటలైనా ఇవ్వలేదు. దీంతో గిరిజనులంతా స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు తాడంగి రంగారావు, నరేష్, శంకర్రావు, గోపాల్, ఈశ్వరరావు మాట్లాడుతూ చోళపదం పంచాయతీలోని రెబ్బ, వనధార గిరిజన గ్రామాలకు చెందిన సుమారు 80మంది రేషన్ లబ్ధిదారులకు బియ్యం ఇవ్వలేదన్నారు. సేల్స్‌మెన్ నిర్లక్ష్య వైఖరి మారాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమం వద్దకు డిప్యూటీ తహశీల్దార్ ఫకీర్ వచ్చి మీకు బియ్యం ఈ రాత్రి 10గంటల్లోపు అందుజేస్తామని తెలిపారు. జిల్లాస్థాయి అధికారులతో సంప్రదింపులు చేసి ఆయన కూడా డిపో వద్దకు వెళ్లి ఈ బియ్యం వెంటనే అందజేస్తామని చెప్పడంతో నిరసన విరమించారు. మంగళవారం ఉదయం 10 గంటల్లోపు లబ్ధిదారులకు రేషన్ బియ్యం ఇవ్వపోతే తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన యువకులు ఈశ్వరరావు, వేణు, మహేష్, చెన్నారావు, పారయ్య, గోపాలరావు పాల్గొన్నారు.

21న జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లావ్యాప్తంగా ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పల్స్ పోలియో కార్యక్రమంపై విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 99,507 మంది పిల్లలకు 905 బూతుల్లో పల్స్ పోలియో చుక్కలను వేయనున్నట్లు తెలిపారు. వీటితో పాటు 19 రవాణా కేంద్రాలు, 42 సంచార బందాలు ద్వారా కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు చెప్పారు. మురికివాడలు, వలస కార్మిక ప్రాంతాలు, నిర్మాణ స్థలాలు, ఇటుక బట్టీలు వంటి ప్రాంతాలను కవర్ చేయడానికి 42 మొబైల్ బృందాలు పనిచేస్తాయని అన్నారు. ప్రతి సంచార బృందంలో ఒక వైద్యాధికారి మరియు ఇద్దరు సభ్యులు ఉంటారని అన్నారు. వీరంతా 178 మారుమూల ప్రాంతాలతో పాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆస్పత్రులు, మేళాలు, బజార్లు, పర్యాటక ప్రాంతాలను కవర్ చేస్తారని వివరించారు. ఇందుకోసం లక్ష డోసుల పైగా జిల్లాకు రానున్నాయనిన్నారు. ఏ కారణాల వల్ల అయినా పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లల కోసం ఈనెల 22, 23 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. పల్స్ పోలియో కార్యక్రమంలో 72 మంది వైద్యాధికారులు, 382 మంది ఎఎన్ఎంలు, 277 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, 1,545 ఆశా కార్యకర్తలు, 2,075 అంగన్వాడీ సిబ్బంది, ఇతర సిబ్బంది (ఫార్మాసిస్టులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు మొదలైనవారు) పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. 9 మంది జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల బృందంతో పాటు 93 మంది ఆరోగ్య పర్యవేక్షకులు కావున ప్రతి తల్లి, తండ్రి తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజంలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక శ్రీ సత్య సాయి మందిరంలో ఈనెల 16న విజయనగరానికి చెందిన శ్రీ సాయి సూపర్ స్పెషలిస్ట్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎ.శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబి నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎముకలు, దగ్గు, జలుబు, జ్వరం, చెవి, ముక్కు, గొంతు, నరాలు, కీళ్లు, నడుము, కడుపునొప్పి, ఫైల్స్, హైడ్రోసిల్, హెర్నియా తదితర వ్యాధులకు సంబంధించి ఉచితంగా వైద్య తనిఖీలు చేయనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పొట్టి శ్రీరాములుకు నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్

భాషాప్రయుక్త రాష్ట్రాలకు కారణభూతుడు పొట్టి శ్రీరాములు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి కొనియాడారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ అమరజీవి పొట్టి శ్రీరాములు, పటేల్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలుగుభాషకు కొత్త అర్థం చెప్పిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములని అన్నారు. తెలుగు వారికి ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహాపురుషుని వర్ధంతిని ప్రతి ఏటా డిసెంబర్ 15న నిర్వహిస్తూ స్మరించుకోవడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. అలాగే పటేల్ భారత రాజ్యాంగ రచనలో ప్రముఖ పాత్ర వహించారని, స్వాతంత్ర్యం అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గంలో హోంశాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా బాధ్యతలు నిర్వహించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డిఆర్డిఎ ప్రాజెక్ట్ అధికారి ఎం.సుధారాణి, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి ఇ.అప్పన్న, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది, నివాళులు అర్పించి, వారి సేవలను స్మరించుకున్నారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి మాధవరెడ్డి, ఐటిడిఎ సమావేశం మందిరంలో ఇన్‌ఛార్జి పిఒ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.



సభలో మాట్లాడుతున్న యూనియర్ రాష్ట్ర కార్యదర్శి రాఘవరెడ్డి

సమస్యలపై నిరంతరం పోరాడాలి

ప్రజాశక్తి - సీతానగరం

సమస్యలపై విద్యుత్ కార్మికులు నిరంతరం పోరాడాలని 327 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని జోగింపేటలో విద్యుత్ ఉద్యోగుల ఆత్మీయక కలయిక సమావేశ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యల కోసం ఐక్య పోరాటాలు చేస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో విద్యుత్ కార్మికుల హామీల కోసం పోరాడామని, అందులో భాగంగా రాష్ట్రంలో 8వేల మంది సచివాలయంలో జెఎల్ఎం ప్రమోషన్ల కోసం పోరాటం చేస్తే దాన్ని ప్రభుత్వాంగీకరించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు, బి.సాయికృష్ణతో పాటు విజయనగరం జిల్లా పార్వతీపురం జిల్లా ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లా భామిని ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో బాధిత గిరిజన చిరుద్యోగి పి.విజయ కుమారి కుటుంబంతో కలిసి జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో ప్రిన్సిపల్ గిరిజన చిరుద్యోగుల పట్ల కుల వివక్ష పాటిస్తున్నారని వివరించారు. రెండు పూటలా గిరిజన ఉద్యోగుల బ్యాగులు తనిఖీ చేసి దొంగతనాలు అంటగట్టి ఉద్యోగాల నుంచి తొలగించాలని చూస్తున్నారని తెలిపారు. సిసి కెమెరాలు ఉన్నప్పుడు బ్యాగ్‌లు తనిఖీ చేసి అవమానించడమేమిటని ప్రశ్నించారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపించాలని, గిరిజన ఉద్యోగుల పట్ల కుల వివక్ష చూపిస్తున్న భామిని ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, గిరిజన ఉద్యోగులకు రక్షణ కల్పించాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.

రోగులకు మందులు అందజేస్తున్న ఆసుపత్రి ఎమ్‌డి పద్మావతి

నీలకంఠాపురం వారపు సంతలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం వారపుసంతలో సోమవారం విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ దూబ పద్మావతి ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో నిరుపేద గిరిజనులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకోగా, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం 250 మంది గిరిజనులకు దుప్పట్లను, నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు 250 నాప్కిన్లను పంపిణీ చేశారు. ఈ మెగా వైద్య శిబిరంలో డాక్టర్ సాయి శంకర్, డాక్టర్ వేలంగిని, డాక్టర్ రత్నం వైద్య సేవలు అందించగా, హాస్పిటల్ మేనేజర్ ధర్మారావు, సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.గిరిజరాణి తదితరులు పాల్గొన్నారు.

జరిమానాలు వసూలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని వాహనదారులు వివిధ సందర్భాల్లో పోలీసులు విధించిన అపరాధ రుసుములను చెల్లించకపోవడంతో వారిని గుర్తించి వసూలు చేసే కార్యక్రమం చేపట్టారు. సోమవారం స్థానిక ఎస్సై వెంకటరమణ ఆదేశాల మేరకు ఎఎస్ఐ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది స్థానిక చర్చ్ సెంటర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులు బకాయి పడ్డ వందలాది రూపాయల అపరాధ రుసుములను వసూలు చేశారు. అలాగే రహదారి భద్రతపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు.

పోలీసు ఉద్యోగాలకు యువతకు శిక్షణ ఇవ్వండి : కాంగ్రెస్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పోలీసు ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన శిక్షణను జిల్లాలోని యువతకు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు వి. దాలినాయుడు, సిరిసుపల్లి సాయి శ్రీనివాస్ జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డిని కోరారు. జిల్లాలో తెలివైన చదువుకున్న శారీరక దారుఢ్యం కలిగిన యువత అనేకమంది ఉన్నారన్నారు. జిల్లాలో సరైన కోచింగ్ సెంటర్లు, కెరీర్ గైడెన్స్ కేంద్రాలు లేక యువత తమ సమయాన్ని వృధా చేస్తున్నారన్నారు. అందుకే జిల్లాలో డిగ్రీ, పీజీ చదువుకున్న యువతకు పోలీస్ శాఖలో ఉన్న నిష్ణాతులైన అధికారులచే ఎస్ఎస్సి, ఎక్సైజ్, పోలీస్, ఆర్మీ, నేవీ, బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్ తదితర ఉద్యోగాలకు అర్హత సాధించేలా తీర్చిదిద్దే ప్రయత్నం చేయాలని కోరారు. అలాగే రానున్న క్రిస్టమస్, సంక్రాంతి పండగ రోజుల్లో జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు మండలం కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కురుకూటి గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గిరిజన బాలిక ఆత్మహత్యయత్నం చేసుకుని సాలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని పత్రికల్లో వెలువడిన వార్త నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. బాలిక ఆత్మహత్యాయత్నానికి దారితీసిన పరిస్థితులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

భరత్ భూషణ్‌రాజ్‌కు రాష్ట్రస్థాయి సాహిత్య అవార్డు

ప్రజాశక్తి - పాలకొండ



అవార్డును అందుకుంటున్న భరత్‌భూషణ్‌రాజ్

దళిత కవి, రచయిత, సామజిక ఉద్యమ నేతనూతులపాటి భరత్ భూషణ్‌రాజ్ (కన్వీనర్, ఉత్తరాంధ్రా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ఐక్య వేదిక)కు అరుదైన రాష్ట్ర స్థాయి గౌరవ పురస్కార అవార్డు లభించింది. ఆదివారం రాత్రి గుంటూరులో ప్రముఖ దళిత కవి, కీర్తిశేషులు కుసుమ ధర్మన్న స్మారక సాహిత్య రాష్ట్ర అవార్డు లభించింది, మాజీ హోంమంత్రి మేకతోటి సుచరిత, మాజీ ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, మాజీ ఎంపీ హర్ష కుమార్, మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్, మాలమహాసభ జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకట్రావు, గోళ్ళ అరుణ్ కుమార్ చేతులు మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. దళిత సాహిత్యంలో భరత్ భూషణ్ తనదైన శైలితో ఆ జాతిని మేల్కొలపుతున్నారని పెద్దలు ప్రసంశించారు. ఈ అవార్డు తనకు రావడం పట్ల భరత్ భూషణ్ కృతజ్ఞతలు తెలిపారు. దళిత సాహితీ సేవలో తన బాధ్యత పెంచింది అని ఒక ప్రకటన లో తెలిపారు.

బాలికల విద్యకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బాలికల విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా రూ.కోటీ 20 లక్షల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో భవనాన్ని నిర్మించనున్నట్లు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. స్థానిక కెజిబివి పాఠశాల ప్రాంగణంలో అదనపు భవన పనుల నిర్మాణానికి ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం అండ్ జూనియర్ కళాశాల వద్ద ఎడబ్ల్యుపి అండ్‌బి రూ. 18.50 లక్షల నిధులతో నిర్మించిన నూతన కంప్యూటర్ గదిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యలో సాంకేతిక పరిజ్ఞానం కీలకమని, కంప్యూటర్ అవగాహనతో విద్యార్థినులు పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా తయారవుతారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత బాలికలకు ఆధునిక విద్యా సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

సాంకేతిక విద్య అభివృద్ధికి పాల్ ల్యాబ్

మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్య అభివద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పాల్ ల్యాబ్ విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే జగదీశ్వరి అన్నారు. స్థానిక కస్తూరిబా గాంధీ పాఠశాలలో పాల్ ల్యాబ్ విద్యా కార్యక్రమంపై విద్యార్థులు ఆరో తరగతి నుండి తొమ్మిదో తరగతి వరకు సాంకేతిక విద్యపై చూపుతున్న ఆసక్తిని చూసి ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. పాల్ ల్యాబ్‌లో ఏఏ పాఠ్యాంశాలు ఉంటాయి, అవి ఎలా నిర్వహిస్తున్నారు, విద్యార్థులు ఏ విధంగా నేర్చుకుంటున్నారనే అంశాలపై

కంప్యూటర్ లేబ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి చదువుకోడానికి వచ్చే గిరిపుత్రులకు ఈ సాంకేతిక విద్య ఎంతో ఉపయోగకరంగా మారిందని ఎమ్మెల్యే అన్నారు. పాల్ ల్యాబ్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్పర్సన్ కడ్రక కళావతి, రాష్ట్ర మహిళా కార్యదర్శి బిడ్డిక పద్మావతి, టిడిపి మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు మండంగి భూషణ్ రావు, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, పలువురు కూటమి నాయకులు, ఎంఇఒ చంద్రశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీరంజిని, సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న రాజన్నదొర

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి - సాలూరు

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర కొనియాడారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే ఆకాంక్షతో పోరాడి చివరకు ఆమరణ నిరాహార దీక్ష కూడా చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములని, అటువంటి మహనీయుడ్ని మనమంతా స్మరించుకోవడం గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి డి వెంకటరమణ నాయుడు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఎఒ డి.వెంకటరమణ, పిఆర్ జెఇ డి.కళ్యాణి దుర్గ, ఎపిఒ జి.సత్యంనాయుడు, సీనియర్ సహాయకులు వి.శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిఆర్‌ఎంటిల వేతనాలు పెంచాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లాలో గల సిఆర్‌ఎం టీచర్ల యునైటెడ్ ఫోరం ఆధ్వర్యాన సిఆర్‌ఎం టీచర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం జిల్లా కార్యదర్శి జి.రమేష్ మాట్లాడుతూ 2011లో 4034 స్కూల్ కాంప్లెక్స్‌ల్లో సిఆర్పీలుగా ఎంపికై 14 ఏళ్లుగా పాఠశాల సమగ్ర శిక్ష లో సిఆర్‌ఎంటిలుగా పని చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం సృష్టించిన ఎ,బి క్లస్టర్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అదనపు పని భారాన్ని తగ్గించాలని కోరారు. తొమ్మిదేళ్లుగా పిఎబి ఆమోదించిన రూ.23,500 వేతనానికే పని చేస్తున్నామని చెప్పారు. మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలని కోరారు. విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనారోగ్యంతో మరణిస్తే రూ.10లక్షల ఎక్స్ గ్రేషియో మంజూరు చేయాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు.

కాట్రగాఢ -బి లో చంద్రన్న సంచార చికిత్స

ప్రజాశక్తి -భామిని

మండలంలోని కాట్రగాఢ-బిలో బత్తిలి పిహెచ్‌సి వైద్యులు కొండపల్లి రవీంద్ర ఆధ్వర్యంలో సోమవారం చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామంలోని అంగన్వాడీ సెంటర్‌ల్లో హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, పిల్లలు బరువు, ఆహారం తయారీ విధానాన్ని పరిశీలించారు. గ్రామంలోని పాఠశాలలో చదివే విద్యార్థులకు పలు వ్యాధులపై అవగాహన కలిగించి, పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తయారీ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బత్తిలి పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఉన్నారు.

అక్రమ డెప్యుటేషన్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలోని గుమ్మలక్ష్మీపురం మండలంలో డిప్యూటీ మేట్రిన్ అక్రమ డెప్యుటేషన్ రద్దు చేయాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఐటిడిఎ డిడి విభాగంలో సూపరింటెండెంట్ దేశ్‌కు గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం, ట్రైబల్ రైట్స్ ఫోరం తదితర సంఘాలు నాయకులు పాలక రంజిత్ కుమార్, ఆరిక చంద్ర శేఖర్,ఇంటికొప్పల రామకృష్ణ, దుక్క సీతారాం, రొబ్బ లోవరాజ, మండల గిరిధర్ తదితరులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుమ్మ లక్ష్మీ పురం మండలం బీరుపాడు ఆశ్రమ పాఠశాల నుంచి రేగిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు ఒక టీచర్‌ను అక్రమంగా డెప్యుటేషన్ వేసి నిబంధనలు పాటించకుండా డెప్యూటీ మేట్రిన్‌గా కూడా నియమించారని చెప్పారు. ఈ అక్రమ చేసిన డెప్యుటేషన్ రద్దు చేయాలని పలు మార్లు ఐటిడిఎ పిఒ, డిడిలను కోరిన అక్రమ డెప్యూటీ మేట్రిన్ నియామకం రద్దు చేయలేదని వివరించారు. తక్షణమే అక్రమ డెప్యూటీ మేట్రిన్ నియామకం రద్దు చేయాలని లేదంటే శుక్రవారం పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీస్ వద్ద దీక్ష చేస్తామని చెప్పారు.

రబీ పంటల సాగుపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రబీ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారిణి టి.జ్యోత్స్న తెలిపారు. మండలంలోని నాగూరులో సోమవారం రైతులతో మొక్కజొన్న, పెసర, మినుము తదితర వేసవి పంటలపై శిక్షణా కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంటలసాగులో విత్తన యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ, పురుగుల నివారణ తదితర అంశాలపై వివరించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంలో భాగంగా డ్రోన్ టెక్నాలజీ, నానో ఎరువుల

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ జ్యోత్స్న

వినియోగం తదితర అంశాలపై వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధతులలో సాగుచేస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు ఉన్నారు.

పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎఎస్‌పి మనీషారెడ్డి

పోలీసు స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా పార్వతీపురం ఎఎస్‌పి మనీషారెడ్డి వంగలపూడి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి స్టేషన్‌లోని సమస్యలను అడిగి తెలుసుకుని, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సాలూరు రూరల్ సిఐ రామకృష్ణ, మక్కువ ఎస్ఐ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

వెలిగితే ఆగవు... ఆగితే వెలగవు

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో పంచాయతీల ద్వారా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు వెలిగితే ఆగవు, ఆగితే వెలగవు అన్న రీతిలో దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంలోని సిబిఎం, మర్రి, శైల, ఊజుల, బాబు జగజ్జీవన్‌రాం కాలనీలతో పాటు కస్పా, తదితర వీధుల్లో రాత్రీ పగలు అన్న తేడా లేకుండా సూర్యునితో పోటీపడి వెలుగులు వెదజల్లుతున్నాయి. కొన్ని వీధుల్లో అయితే విద్యుత్ దీపాలు లేక ప్రజలు చీకట్లోనే కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. విద్యుత్ ఆదా చేయాల్సిన అధికారులే చూసీ చూడనట్టు వ్యవహరించడంతో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా నిత్యం వెలుగులు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్‌ను ఆదా చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సొంత సమస్యగా భావించి పరిష్కరించండి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పిజిఆర్ఎస్) వచ్చిన అర్జీలు తమ సొంత సమస్యగా భావించి నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని, 48 గం.ల్లోగా ప్రతి సమస్య పరిష్కారం కావాలని హితవు పలికారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని, బాధ్యులపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఇందులో వివిధ ప్రాంతాలకు చెందిన అర్జీదారులు తమ వినతులను కలెక్టరుకు అందించగా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రతి సమస్యను తమ స్వంత సమస్యగా భావించినపుడే, శాశ్వత పరిష్కారం చూపగలుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్జీల పరిష్కారం వేగవంతం చేసే ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలకు తావివ్వరాదని జెసి ఉద్బోధించారు. పరిష్కారమైన సమస్యలతో అర్జీదారులు సంతృప్తి చెందాలని, ఎట్టి పరిస్థితుల్లో అర్జీలు పునఃప్రారంభం కారాదని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : తమ సమస్యలపై ఫిర్యాదుదారులు తెలిపిన సమస్యలను త్వరిత గతిన, పారదర్శకంగా నిర్వహించాలని ఎస్పీ మాధవి రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో 9 ఫిర్యాదులు అందాయి. జిల్లా కేంద్రానికి రానివారు దగ్గరలో గల పోలీస్ స్టేషన్‌లో కూడా పిర్యాదు చేయవచ్చు , వాటిని కూడా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" పిర్యాదుగా పరిగణిస్తామని ఎస్పీ తెలిపారు

పిజిఆర్‌ఎస్‌కు 19 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో పిజిఆర్ఎస్ ఎపిఒ వెంకటగణేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పిజిఆర్‌ఎస్‌కు 19 అర్జీలు వచ్చాయి. ఈ వినతుల్లో ఎక్కువగా ఉపాధి కల్పించాలని, రోడ్డు సమస్య పరిష్కరించాలని, రుణాలు ఇప్పించాలని తదితరు వినతులు వచ్చాయి. అదేవిధంగా ఐటిడిఎలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి, ఎపిడిఒ మిశ్రా, ఎస్పై వై.అమ్మనరావు, ఎఒ వాహిని, హెచ్ఒ జయశ్రీ, డిపిఎం రమణ, జిసిసి మేనేజర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి -సీతంపేట

స్థానిక కెజిబివి పాఠశాలలో ఐసిడిఎస్ సిడిపిఒ సిమ్మాలమ్మ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలలు పనికి వెళ్లకుండా పాఠశాలలో చేరి బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. మైనర్లకు బాల్యవివాహాలు చేయరాదని, చట్ట పరంగా నేరమని, తద్వార వచ్చిన నష్టాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు గౌరి, వెంకటలక్ష్మి, ఆదిలక్ష్మి, ప్రిన్సిపల్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని బందలుప్పిలో ఈనెల 4న రాత్రి బాలనాగేశ్వరస్వామి ఆలయంలో జరిగిన చోరీపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన ఎస్‌జి శంకరరావు సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆలయం చోరీ ఘటనలో సుమారు 1.5కిలోల వెండి, పది కిలోల ఇత్తడి, హుండీలో ఉన్న నగదును దొంగతనం చేశారని తెలిపారు. దీనిపై ఈనెల 5న గ్రామపెద్దల అంగీకారంతో రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు కేసు నమోదు చేయలేదని చెప్పారు. పదిరోజులైనా కేసు నమోదు చేయకపోవడం మంచిది కాదని, వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శంకరరావు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పచ్చకామెర్ల పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - సీతంపేట

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు మండలంలోని కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ చాందిని, అజయ్ అన్నారు. మండలంలోని మల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ పచ్చకామెర్ల నిర్ధారణ పరీక్షలను సోమవారం నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ సందర్భంగా వైద్య బృందం విద్యార్థులకు పచ్చకామెర్ల వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అవసరమైన విద్యార్థులకు ప్రాథమిక వైద్య సలహాలు అందించి, తదుపరి చికిత్సకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు పి.నారాయుడు, డిప్యూటీ వార్డెన్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎటిడబ్ల్యుఒ విచారణ

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై సహాయ గిరిజన సంక్షేమ అధికారి కృష్ణవేణి సోమవారం విచారణ చేపట్టారు.పాఠశాలలో ఆదివారం విద్యార్థిని ఫినాయిల్ తాగడంతో హెచ్‌ఎం మంజు ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందిన తర్వాత బాలిక ప్రాణాపాయం నుంచి బయటపడింది.ఈ నేపథ్యంలో సహాయ గిరిజన సంక్షేమ అధికారి కృష్ణవేణి తోటి విద్యార్థులను, ఉపాధ్యాయులను విచారించారు.నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

అమ్మో ఆ హోటలా..?

ధరలతో జేబుకు చిల్లు ◆ పరిసరాలు దుర్గంధ భరితం

ప్రజాశక్తి - పాలకొండ

అమ్మో ఆ హెూటల్‌కు వెళ్లాలంటే భయం... కార్పొరేట్ సిటీల్లో లేనంత భారీ ధరలతో జేబులు చిల్లుపడే పరిస్థితి. అంతే కాకుండా హోటల్ పరిసరాలు అపారిశుధ్యం. దీంతో హోటల్‌కు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. అయినా హోటల్ నిర్వహణ పట్ల అధికారులు ఉదాసీనంగా ఉన్నారు. ఆ హోటల్ ఎక్కడో లేదు. స్థానిక కోటదుర్గ ఆలయానికి అతి సమీపంలో అన్నా క్యాంటీన్ సమీపాన ఉంది. ఈ హోటల్‌లో ఏం తినాలన్నా జేబులకు చిల్లి పడే పరిస్థితి. అలాగని నాణ్యతతో కూడిన పదార్థాలంటే అదీ కూడా లేదు. ఈ హోటల్‌లో భోజనం చేయాలంటే కనీసం రూ.500ఉంటే వెళ్లాలి. డివిజన్ కేంద్రమైన పాలకొండకు వివిధ పనులపై వచ్చినవారు ఈ హెూటల్ వైపు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఇటీవల ఈ హోటల్‌కు భోజనానికి కొంతమంది వెళ్లగా, పుట్టగొడుడు కూర (మూడే ముక్కలు)కు రూ.240 వసూలు చేశారు. చికెన్ కూడా అంతే వసూలు చేశారు. మిగిలిన కూరల ధరలు కూడా ఇంతే. ఆ హెూటల్ నిర్వాహకులు రాజకీయ నేతకావడంతో అధికారులు వారి జోలికి పోవడం లేదు. దీంతో ఇష్టానుసారంగా రేట్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

28న బొబ్బిలి కళోత్సవం

బొబ్బిలి+ ఎమ్మెల్యే బేబీ నాయన ఆధ్వర్యంలో బొబ్బిలి దర్బార్ మహల్ ఆవరణలో ఈ నెల 28న సాయంత్రం బొబ్బిలి కళోత్సవం పేరుతో ప్రాచీన జానపద కళల ప్రదర్శన నిర్వహించనున్నామని నిర్వాహకులు కరుణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన జాలారి బాగోతం, తప్పెటగుళ్ళ, కోలాటం, చెక్కభజన, బిందెల డాన్స్, బుర్రకథ, జానపదములు మొదలగు కళలను భావితరాలకు అందించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని కళాబంధు బేబీ నాయన చెప్పారని తెలిపారు. బొబ్బిలి మల్టీ టాలెంట్స్ గ్రూప్ నిర్వాహకులు జి.కరుణకుమార్ డాన్స్ మాస్టర్ మీసాల చినగౌరినాయుడు, చప్ప అప్పలనాయుడు, తదితరులు వివరించారు.

BEFORE THE HONOURABLE A.P STATE WAKF TRIBUNAL AT KURNOOL
O.S No. 59/2023

Between:
Shaw Gareeb Darvesh Takia, kaki veedhi of Patha Srikakulam represented by its Mutawalli Mohd. Baig @ Habeeb s/o late Dada Saheb, aged 75 years retired employee Mutawalli of Plaintiff institution R/o 12-9-51/B kaki veedhi Srikakulam. .....Plaintiffs
And:
1. Kareem Baig alias Baba (died)
2. A.P. State WAKF board represented by its Chief Executive Officer, (proforma defendant) and four others .....Defendants

To,
D-5: Shahanaz Begum, W/o Late Mehamood, aged 42 years, R/o of Saluru Town, Manyam District.

The Plaintiff filed the above suit against the defendants praying the Honorable court to pass judgement and decree in favor of the plaintiff against the defendants for recovery of possession of the suit schedule property, for mandatory injuction etc. reliefs and the same is posted to 02/01/2026 appearance of D5 along with D3, D4 & D6.

The above suit is posted to the date of **02-01-2026 at 10.30 AM** for your appearance before the above Honorable Tribunal at Kurnool. You are therefore called upon to appear on the same date & time either in person or through Advocate failing which, you will be set ex-party and case will be decided in your absence based on the material available.

// BY ORDER OF A.P WAKF TRIBUNAL AT KURNOOL. //

PAGOTI MOHAN RAO
ADVOCATE FOR PLAINTIFF,
SRIKAKULAM, CELL:7013 905580.